సాక్షి పార్వతీపురం మన్యం

శనివారం । 25 । జనవరి । 2025



'హద్దు' మీరి అక్రమ రవాణా

పీడీఎస్ బియ్యం అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. చౌకధరల డిపోల నుంచి పేదలకు అందాల్సిన బియ్యం వ్యాపారంగా మారిపోయింది. - IIలో



బాలికల భద్రతకు భరోసా కల్పిద్దాం

బాలికలకు భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. - IIలో



క్షేత్రస్థాయిలో నేర నియంత్రణకు డ్రోన్ వినియోగం - IIలో

క్షేత్రస్థాయిలో నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ వినియోగం క్రియాశీలకంగా మారనుందని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

వైద్య కళాశాల హుళక్కే..!

- ప్రభుత్వ వైద్య కళాశాల టెండర్లను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలన్న నాటి ముఖ్యమంత్రి జగన్ సంకల్పానికి తూట్లు
- జిల్లాలో వైద్య కళాశాల కోసం రూ.600 కోట్ల కేటాయింపు
- చంద్రబాబు నిర్ణయంతో కలగా మెడికల్ కాలేజీ



సాక్షి, పార్వతీపురం మన్యం: కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు.. ప్రజలకు శాపాలుగా మారుతున్నాయి. గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న ప్రజాపయోగకర నిర్ణయాలను ఒక్కొక్కటిగా రద్దు చేసుకుంటూ వస్తున్న చంద్రబాబు... పేదలకు మెరుగైన వైద్యం, విద్య అందించాలన్న సంకల్పంతో నాటి ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాలను 'కిల్' చేసే యోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం, నిర్వహణను పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు అప్పగించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే పార్వతీపురం మన్యం జిల్లాకు గత ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ టెండర్లను కూడా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

జిల్లాతోపాటు, ఒడిశా వాసులకు ప్రయోజనం

మన్యం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే ఇటు జిల్లాతో పాటు, అటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పేద విద్యార్థులు, గిరి పుత్రులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలను పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో నిర్మించే యోచనలో ఉంది. దీంతో పాటు.. ఇప్పుడు ఏకంగా గత ప్రభుత్వం మంజూరు చేసిన కళాశాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం కలగానే మిగిలిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత ఆగస్టు నెలలో జిల్లా పర్యటనకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విచ్చేశారు. ఆ సమయంలో మూడో ఫేజ్‌లో ఇక్కడి వైద్య కళాశాల ఉందని, ఆ మేరకు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. పార్వతీపురానికి వైద్య కళాశాల ఏర్పాటు అవసరమని చెప్పారు. ఆయన మాటలకే విలువ లేకుండా పోయిందని ప్రజాసంఘాల నాయకులు

చిన్నపాటి సమస్యకూ రిఫర్ చేసేయడమే..

జిల్లాలో ప్రధాన ఆస్పత్రితోపాటు, మూడు ఏరియా ఆస్పత్రులు, 37 పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్క జిల్లా ఆస్పత్రిలోనే రోజుకు 500కుపైగా ఓపీ నమోదవుతోంది. పీహెచ్‌సీల్లోనూ 200 నుంచి 300 వరకు ఓపీ ఉంటోంది. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ఆస్పత్రి ఒక్కటే దిక్కవుతోంది. అక్కడ కూడా కొన్ని రకాల సేవలు అందడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో విజయనగరం, విశాఖ ప్రాంతాలకు రోగులకు వెళ్తున్నారు. సరైన సదుపాయాలు లేక, చిన్నపాటి కేసులను కూడా వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులకు, విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. ఇది రోగులకు, వారి బంధువులకు వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. అంత దూరం వెళ్లేలోగా మార్గమధ్యంలో ప్రాణాలు గాలిలో కలసిపోతున్న సందర్భాలు అనేకం. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణమైతే ఇక్కడే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతాయి. వైద్యులు, వైద్య సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే వంటి అధునాతన పరికరాలు అందుబాటులో ఉంటాయి. పల్మనాలజీ, న్యూరో ఫిజిషియన్, న్యూరో సర్జన్, పెథాలజీ, నెఫ్రాలజీ వంటి వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు. ఈ వైద్యసేవలన్నీ ప్రజలకు ఉచితంగానే అందుతాయి. ఇవే సేవలను ప్రైవేట్ భాగస్వామ్యంతో చేస్తే పేద రోగులకు మళ్లీ వ్యయ ప్రయాసలే మిగులుతాయి.

ఏజెన్సీ వాసులకు వైద్యం అందని ద్రాక్షేనా?

ఏజెన్సీ వాసులకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోతున్న పరిస్థితి ఏర్పడుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో సరైన వైద్య సదుపాయాలు లేక, అత్యవసర సమయంలో రోగులను విజయనగరం, విశాఖ కేజీహెచ్‌లకు తరలించాల్సి వస్తోంది. ఇక్కడి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసింది. దీంతోపాటు.. జిల్లాకొక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తామన్న నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుకనుగుణంగా మన్యం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి రూ.600 కోట్లను కేటాయించింది. పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేస్తూ జీవో 301 జారీ చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ప్రభుత్వ వైద్య కళాశాలతోపాటు, అనుబంధంగా నర్సింగ్ కళాశాల, సిబ్బంది భవనానికి అవసరమైన భవనాలు నిర్మించాలని భావించింది. ఇందుకోసం అనువైన స్థలాలనూ అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల వద్ద స్థలం అనుకూలంగా ఉంటుందని భావించారు. అనుమతులు రాగానే పనులు మొదలవుతాయని అంతా ఊహించారు. ఈలోగా ప్రభుత్వం మారడంతో జిల్లా ప్రజల ఆశలు ఆవిరైపోయాయి. అంతా సక్రమంగా జరిగితే 2025–26 సంవత్సరంలో వైద్య కళాశాల సేవలు అందుబాటులోకి రావాల్సి ఉంది.

కూటమి ప్రభుత్వం నిర్ణయం ఉపసంహరించుకోవాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పేదలకు ఉపయోగపడేలా ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. నిర్మాణాలు, అడ్మిషన్లు, తరగతులు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యం, వైద్య విద్యను పేదల దరి చేరకుండా చేసేందుకు పీపీపీ పద్ధతి తీసుకొచ్చింది. ఇది సరైనది కాదు. తక్షణమే ఈ నిర్ణయం ఉపసంహరించుకోవాలి. పార్వతీపురంలో వైద్య కళాశాల నిర్మాణం కోసం పిలిచిన టెండర్‌ను రద్దు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, యథావిధిగా కొనసాగించాలి.

– పాలక రంజిత్‌కుమార్, ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ సంఘం

పేద రోగులు, విద్యార్థులపై కక్ష సాధింపా?



పేదలకు మెరుగైన వైద్యం, ఇక్కడి పిల్లలకు వైద్య విద్యను చేరువ చేయాలన్న ఉద్దేశంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాకో వైద్య కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. మన్యం జిల్లాకు కూడా వైద్య కళాశాల వస్తే గిరిజనులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆనందపడ్డాం. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. నాటి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్న చంద్రబాబు.. పేదలపైనా కక్ష తీర్చుకుంటున్నారు. మన్యం జిల్లా ప్రజలపై అభిమానం ఉంటే ప్రభుత్వ వైద్య కళాశాలను యథావిధిగా కొనసాగించాలి.

– విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే, పాలకొండ

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్దర్ కేక్‌ను కట్‌చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌ఓ కె.హేమలత, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పత్రాలు చూపించి రాయితీలు పొందండి

సాలూరు: అవసరమైన పత్రాలు చూపించి ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ రాయితీలు పొందాలని ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు చలపతిరావు కోరారు. విద్యుత్ బిల్లుల భారం, కనెక్షన్ల తొలగింపుపై సాలూరు 25వ వార్డు బంగారమ్మపేటకు చెందిన ఎస్సీ మహిళలు ఇటీవల ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. కాలనీని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. బకాయి బిల్లులు చెల్లించకపోవడంతోనే కనెక్షన్లు తొలగించినట్టు చెప్పారు. ఆధార్, కుల, ఆదాయ, రేషన్ కార్డు తదితర ధ్రువపత్రాలను వార్డు సచివాలయంలో చూపించి విద్యుత్ రాయితీకి అర్హత పత్రం పొందాలని సూచించారు. వినియోగదారు చార్జీల కింద ప్రతినెలా రూ.25 నుంచి రూ.50 చొప్పున విధిగా చెల్లించాలన్నారు.

శంబర జాతరకొచ్చే భక్తులకు వైద్యసేవలు



శంబర పీహెచ్‌సీలో మందుల నిల్వలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తెలిపారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరిగే తొలేళ్లు, సిరిమానోత్సవ సమయాల్లో విరివిగా వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తామన్నారు. ఇందులో భాగంగా శంబర పీహెచ్‌సీను ఆయన శుక్రవారం పరిశీలించారు. మందుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. శంబర గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసే స్థలాలను పరిశీలించారు. జాతరలో 24 గంటలూ వైద్యసేవలు భక్తులకు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు కిరణ్‌కుమార్, రమ్యశ్రీలకు సూచించారు. 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పీఓ వినోద్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' వేతనం రూ.300 వచ్చేలా చూడాలి

- గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు కమిషనర్ శివప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న శివ ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులకు సగటున రూ. 300 వేతనం వచ్చేలా పనులు కల్పించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో శుక్రవారం క్షేత్ర సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో చేపలపెంపకం కోసం కనీసం ఒక పాండ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం ఒక పశువుల షెడ్డు ఉండాలన్నారు. జిల్లాలో వ్యవసాయ సంబంధ పనులనే అధికంగా చేపట్టాలని సూచించారు. ప్రకృతి వనరుల యాజమాన్యంపై క్షేత్ర సహాయకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ జె.సునీత, డ్వామా పీడీ శారదాదేవి, ఏపీడీ మణికుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ అర్జీలు పునఃప్రారంభం కారాదు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో అర్జీలు పునఃప్రారంభం కారాదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించాలన్నారు. పీఎం జన్‌మాన్ పనులు, పీఎంఏవై 2.0 కింద నిర్మిస్తున్న గృహాలు వేగవంతం కావాలన్నారు. అనుమతులు పొంది నిర్మాణం చేయని గృహాలను తక్షణమే గ్రౌండింగ్ చేయాలన్నారు.

పీఎంజీఎస్‌వై కింద జిల్లాలో రహదారులను నిర్మించుకొనే అవకాశం ఉందని, అందుకు వివరాలను సేకరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె. హేమలత, కెఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, డీసీహెచ్‌ఓ బి.వాగ్దేవితో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జైవిక్ ఇండియా అవార్డు గ్రహీతకు అభినందనలు



రవీంద్రను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జైవిక్ ఇండియా అవార్డు గ్రహీత ఆరిక రవీంద్రను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం అభినందించారు. కలెక్టర్‌ను రవీంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్నవారికి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ జైవిక్ ఇండియా అవార్డులను ప్రదానం చేస్తోంది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం, ఎంపెడా(ఏపీఈడీఏ) సౌజన్యంతో ఇంటర్నేషనల్ కాంపిటేషన్స్ సెంటర్‌ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ సంస్థ అవార్డులను ప్రకటిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరుగురికి అవార్డులు రాగా అందులో సీతంపేట మండలం దుగ్గి గ్రామానికి చెందిన ఆరిక రవీంద్ర ఒకరు. ఆయన నాలుగు ఎకరాల్లో మూడు సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తుండగా గత రెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం దిశగా వరి, పసుపు, చిరు ధాన్యాలు, అపరాలు, జీడిలో అంతర పంటలను సాగు చేశారు. గ్రామమంతా ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు చేయాలనే సంకల్పంతో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయన కృషికి ఉత్తమ ప్రకృతి వ్యవసాయం విభాగంలో దక్షిణ జోన్‌లో మొదటి బహుమతి కింద రూ.లక్ష నగదు, జ్ఞాపికను ఈనెల 22న బెంగుళూరులో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవీంద్రను అభినందిస్తూ జిల్లాలో పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, అందులో రైతులు భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాకు చెందిన వ్యక్తికి అవార్డు రావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రొగ్రాం మేనేజర్ పి.షణ్ముఖరాజు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణే ధ్యేయం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల చదువును పరిశీలిస్తున్న ఆర్‌జేడీ చిన్మయదేవి

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణే ధ్యేయంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయని స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (విశాఖపట్నం) చిన్మయదేవి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కేంద్రానికి సరఫరా అవుతున్న పౌష్టికాహారం సరఫరాపై ఆరా తీశారు. అక్కడి కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలని కార్యకర్తకు సూచించారు. ప్రతీనెల 5వ తేదీన తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించి ప్రీస్కూల్ నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పరిశీలనలో పెదగుడబ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది మరడాన కల్పన, ఎస్.లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మగడ్డి సాగుకు ఆర్థిక సాయం

- జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా వేయి ఎకరాల్లో సాగుకు శ్రీకారం
- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: సుగంధద్రవ్యాల తయారీలో ముడిసరుకుగా వినియోగించే నిమ్మగడ్డి సాగుకు ఔత్సాహిక రైతులను ప్రోత్సహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి చూపే రైతులకు 50 శాతం రాయితీలు ఇస్తామని చెప్పారు. నిమ్మగడ్డి సాగుకు జిల్లాలోని నేలలు, వాతావరణం అనుకూలమని, 2025–26 సంవత్సరంలో ఎంఐడీహెచ్ పథకం కింద పైలెట్ ప్రాజెక్టుగా 1,000 ఎకరాల్లో సాగుచేసేందుకు రూ.కోటి రాయితీని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎకరాకు సుమారు 50 వేల మొక్కలు నాటాలని, మొక్కల కొనుగోలుకు రూ.20 వేలు ఖర్చుకాగా, అందులో గిరిజన రైతులకు 50 శాతం సబ్సిడీ అందిస్తామన్నారు. మొదటి విడతలో మొక్కల ఖర్చుపై రూ.6,000లు, రెండో విడతలో సాగు ఖర్చుపై రూ.4,000లు వెరసి రూ.10 వేలు సబ్సిడీ కింద అందజేస్తామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఇతర కేటగిరీల రైతులకు 40 శాతం రాయితీ కింద తొలివిడతలో రూ.4,800లు, రెండవ విడతగా రూ.3,200లు వెరసి రూ.8వేలు అందజేస్తామని తెలిపారు. ఒడిశాలోని పలు గ్రామాల రైతులు నిమ్మగడ్డిని సాగుచేసి లాభాలు ఆర్జిస్తున్నారన్నారు. ఆసక్తిగల రైతులు వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి వివరాలు నమోదుచేసుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై సబ్‌కలెక్టర్ సీరియస్



ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి



గోపాలపురం వద్ద నాగావళి నదిలో యంత్రాలతో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక తవ్వకాలు

- గోపాలపురం ఇసుక ర్యాంపులో 19 వాహనాలు సీజ్

పాలకొండ: మండలంలోని గోపాలపురం వద్ద నాగావళి నదిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుపై సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి చర్యలు చేపట్టారు. అక్రమంగా మైనింగ్ జరుగుతుందన్న సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం ర్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను చూసి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇసుక తవ్వుతున్న 2 జేసీబీలతో పాటు, ఇసుక రవాణా కోసం ఉంచిన 5 టిప్పర్లు, 12 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పాలకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై పరిశీలన చేసి కేసు నమోదు చేయాలని ఎస్‌ఐ ప్రయోగమూర్తి, డీటీ సన్యాసిరావును ఆదేశించారు.

హద్దు మీరి అక్రమ రవాణా

- ఒడిశాకు తరలుతున్న పీడీఎస్ బియ్యం
- స్థానికంగా కొనుగోలు చేసి తరలింపు
- జిల్లాలో ఆరు నెలల కాలంలో కేవలం 18 కేసులు
- 415 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఆరు నెలల్లో పీడీఎస్ బియ్య కేసుల వివరాలు..	
కేసులు	15
క్రిమినల్ కేసులు	9
సీజ్ చేసిన బొలేరో వాహనాలు	8
సీజ్ చేసిన ఆటోలు	4
స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం	415 క్వింటాళ్లు


డిసెంబర్ 8న ఒడిశా రాష్ట్రం అలమండ బ్లాక్‌కు 2400 కేజీల పీడీఎఫ్ బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన వాహనం

పార్వతీపురంటౌన్: పీడీఎస్ బియ్యం అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. చౌకధరల డిపోల నుంచి పేదలకు అందాల్సిన బియ్యం వ్యాపారంగా మారిపోయింది. కిలోల నుంచి టన్నుల వరకు పెద్ద మొత్తంలో విక్రయిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా కొనుగోలు చేసి రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యానికి కిలో రూ.20 నుంచి రూ.25 వరకు డిమాండ్ ఉంది. కొన్ని ప్రాంతాల్లోని రేషన్‌షాపుల్లో బియ్యం సరిగా పంపిణీ చేయడం లేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో చాలా మంది రేషన్‌డీలర్ల నుంచే అక్రమార్కులకు బియ్యం అందుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. సరిహద్దు రాష్ట్రమైన ఒడిశాకు బియ్యం సరఫరా అవుతోంది. అడపాదడపా విజిలెన్స్ సిబ్బంది అక్రమ రవాణా చేస్తున్న బియ్యాన్ని పట్టుకుంటున్నప్పటికీ సరఫరా మాత్రం ఆగడం లేదు.

కిలో రూ.20 నుంచి రూ.25 వరకు..

చౌకధరల డిపోల నుంచి పేద ప్రజలకు అందే బియ్యం పక్కదారి పట్టడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు, 15 మండలాల నుంచి బియ్యం సేకరిస్తుంటారు. గత ఆరు నెలల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా ఎక్కువైందన్న విమర్శలు వస్తున్నాయి. ఒక్కో ప్రాంతంలో డిమాండ్‌ను బట్టి కేజీ బియ్యం రూ.20 నుంచి రూ.25 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది ఈ బియ్యాన్ని ఎక్కువగా ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్నారు. మరికొంతమంది తూర్పు గోదావరి జిల్లాలకు తరలిస్తున్నారు.

స్థానిక కూటమి నాయకుల అండదండలతో

జిల్లాలో మైదాన ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గిరిజన ప్రాంతాల నుంచి స్థానిక కూటమి నాయకుల అండదండలతో పీడీఎస్ బియ్యం సరిహద్దులు దాటుతోంది. పదులు, వందల కేజీలు కాదు ఏకంగా వేలటన్నుల్లో బియ్యం చేరుకుంటోందని సమాచారం. కొందరు రైస్ మిల్లర్లు ఆ బియ్యాన్ని పాలిష్ చేయించి అక్రమంగా రవాణా చేస్తుంటారు. అక్కడ మంచి ధరకే విక్రయించి బాగానే సొమ్ము చేసుకుంటారని తెలుస్తోంది. ఈ నెలలో పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా సరిహద్దు దాటే వాహనాలు నేరుగా వెళ్తాయనే ప్రచారం ఉంది. ఈ అక్రమ వ్యాపారం బయటకు పొక్కకుండా ఉండేందుకు కూటమి నాయకులకు మామూళ్లు అందుతాయట. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు ఆదాయం ఏస్థాయిలో వస్తోందో.


పార్వతీపురం రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం రైలులో పట్టుకున్న పీడీఎస్ బియ్యం


ఒడిశా రాష్ట్రం అలమండకు బొలేరో వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు (ఫైల్)

మూలాలను గుర్తించడంలో విఫలం..

ఆరు నెలలుగా పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో బియ్యం పట్టుబడినా, సంబంధిత నిందితులు అరెస్టయినా అక్రమ రవాణా ఆగడం లేదు. దీనికి ప్రధాన కారణం అసలైన మూలాలను పట్టుకోలేకపోవడమేనని తెలుస్తోంది. ఇందులో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. విజిలెన్స్, పోలీసులు దృష్టి సారిస్తున్నా బియ్యం అక్రమ రవాణాను నియంత్రించలేకపోతున్నారు. ప్రతి మండల పరిధిలో ఇద్దరి నుంచి ఐదుగురి వరకు క్షేత్రస్థాయిలో పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం. వారి నుంచి పెద్ద మొత్తంలో ఒడిశాకు సరఫరా చేసే వారికి సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఎవరెవరు బియ్యాన్ని సేకరించి, అమ్ముతుంటారో అధికారులకు స్పష్టంగా తెలుసు. కానీ వారందరూ యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా పట్టించుకోకపోవడానికి కూటమి నాయకుల ఒత్తిడే కారణమని తెలుస్తోంది.

విధిగా కేసులు నమోదు చేస్తున్నాం

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. ఒడిశా సరిహద్దు గ్రామాల్లో విజిలెన్స్ అధికారులతో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతాం. వాహనాలు సీజ్ చేసి నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. ఈ నెలలో పోలీసులు, విజిలెన్స్ అధికారులతో కలిసి 5 కేసులు నమోదు చేశాం.

– రాజేంద్ర, సీఎస్‌డీటీ, పార్వతీపురం

క్లుప్తంగా

బోడసింగిపేటలో నగదు, బంగారం చోరీ

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలో శుక్రవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి అందులోని నగదు, బంగారం చోరీ చేసినట్లు బాధితురాలు ఎస్.దుర్గాభవాని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. దుర్గాభవాని, భర్త సూర్యారాయణరాజుతో కలిసి తమ పిల్లలను విశాఖ పట్టణంలోని కాలేజీకి తీసుకుని వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకుని పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదుదారు లక్ష రుపాయల నగదుతో పాటు, రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న పారయ్య

గుమ్మలక్ష్మీపురం: గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎల్విన్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని బుడ్డెమ్మఖర్జ గ్రామానికి చెందిన పాదిలాపు పారయ్య వ్యక్తిగత కారణాలతో ఇంట్లో వున్న గడ్డి మందును తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. ప్రాథమిక చికిత్సను అందించిన సిబ్బంది మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధిద్దాం..


వలంటీర్లకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఎంఎస్ అధ్యక్షురాలు లలితకుమారి


వీరఘట్టం: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పల్లెలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని వయోజన విద్య ఎ.డి వైకుంటరావు సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో 133 మంది ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వలంటీర్ తన పరిధిలో పది మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం వలంటీర్లకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.లలితకుమారి, ఏపీఎం కె.రాము, తదితరులు పాల్గొన్నారు.

ఒడియా పాఠశాలలు కొనసాగించాలి..


మాట్లాడుతున్న ఏపీఓటీఏ సంఘ ప్రతినిధులు

భామిని: రాష్ట్ర ప్రభుత్వం జీఓ 117 రద్దు చేసిన తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఒడియా మాధ్యమం, ఒడియా సెక్షన్ గల బైలింగ్వెల్ పాఠశాలల భవితవ్యం అయోమయంలో పడిందని భామిని ఒడియా టీచర్ల సంఘం (ఏపీఓటీఏ) అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సుశీలా, ఎస్.రాజశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. బత్తిలి జెడ్పీహెచ్ స్కూల్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఒడియా లాంగ్వేజ్ పాఠశాలలను తెలుగు,ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో విలీనం చేయకూడదన్నారు. ఒడియా మీడియం పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

మడ్డువలస ప్రాజెక్టు పరిసరాల్లో కొండచిలువలు


మడ్డువలస వద్ద హతమర్చిన కొండచిలువ

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు చుట్టూ కొండచిలువలు, విషసర్పాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం నమోదు కావడంతో ప్రాజెక్టు పరిసర గ్రామాల చుట్టూ ప్రాజెక్టులో నీరు చేరింది. దీంతో కొండ చాకరాపల్లి, ఎం.సీతారాంపురం, పటువర్ధనం, శ్రీహరిపురం, కొప్పర, గీతనాపల్లి తదితర గ్రామాల సమీపంలో కొండచిలువలు అలజడి సృష్టించడంతో పలు చోట్ల వాటిని హతమరుస్తున్నారు. అలాగే కొండచిలువలు గ్రామాల్లోకి ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. విషసర్పాలతో భయంగా ఉందని, ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిమట్టం తగ్గించాలని ప్రాజెక్టు తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260

బాలికల సంరక్షణ అందరి బాధ్యత


భామినికార్యక్రమలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం


సీతంపేట: సీతంపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

- సీడీపీఓ శాంతి

భామిని: బాలికల సంరక్షణ అందరి బాధ్యతని సీడీపీఓ శాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కె.సత్యం, ఎంఈఓ ఎ.శ్రీనివాస్, ఏపీఓ తులసీదాస్ పాల్గొని బాలికల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఓలు సబితా పట్నాయక్, జ్యోతిలక్ష్మి, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేటలో..

సీతంపేట: జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతంపేటలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైస్కూల్ నుంచి అడ్వంచర్ పార్కు వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, హెచ్‌డబ్ల్యూఓ పి.అమల, ఏఎస్సై సంజీవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

జనచేతన ఆధ్వర్యంలో..

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో జనచేతన సంస్థ కార్యదర్శి బగాది శశిభూషణ చౌదరి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్య, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల కార్మికులు, విద్యాహక్కు చట్టం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు


గాయాలైన వారిని 108లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి వద్ద శుక్రవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తి సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం నుంచి గజపతినగరం వైపు బైక్‌పై వస్తున్న ప్రదీప్, నజామా బేగంలు షికారు గంజి కూడలి వద్దకు వచ్చేసరికి ఎస్ చింతలవలస నుంచి యడ్ల సత్యనారాయణ సైకిల్ తొక్కుకుంటూ జాతీయ రహదారి దాటుతుండగా ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే ఆ ముగ్గురిని 108లో గజపతినగరం సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రీ సర్వేలో డాక్యుమెంట్లు పక్కాగా విచారించాలి

- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవం


రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: రీసర్వే పనుల్లో డాక్యుమెంట్లను పక్కాగా విచారణ చేపట్టాలని పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. పార్వతీపురం మండలంలోని గోపాలపురం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి రీ సర్వే పనులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లో ముందుగా సమాచారం అందించాలని, తగు రసీదులు పొందాలని స్పష్టం చేశారు. భూముల రీ సర్వేలో తలెత్తిన లోపాలను భూ యజమానికి ముందుగా నోటీసులో అందించాలని, తద్వారా తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివాదాస్పద భూములకు సంబంధించిన వివరాలు ఆయా రిజిస్టర్లలో నమోదు చేయాలని చెప్పారు. రీసర్వేలో ఎక్కడా లోపాలు ఉండరాదని అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రీ సర్వే తర్వాత తప్పులు లేని భూ రికార్డులు నెలకొల్పాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వేగావతిలో పడి యువకుడి మృతి


శివశంకర్ మృతదేహం

సాలూరు: పట్టణంలో వేగావతినది నీటిలో పడి ఓ యువకుడు మృతిచెందినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అయన తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన తుపాకుల శివశంకర్(25) స్థానిక వేగావతి నది వద్ద నీటిలో మునిగిచనిపోయి ఉండడాన్ని గమనించి, యువకుడి తల్లి మంగమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శివశంకర్ బహిర్భూమికి వెళ్లి తాగిన మైకంలో నీటిలో పడిపోయి ఉండవచ్చనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

- కొత్తవలసలో ప్రత్యేక హాల్ట్

తాటిచెట్లపాలెం: ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విశాఖపట్నం, పరిసర ప్రాంతాల నుంచి వెళ్లే యాత్రికులు, ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. పెందుర్తి, కొత్తవలస ప్రాంత ప్రయాణికుల కోసం కుంభమేళా ప్రత్యేక రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ ఇస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–గోరఖ్‌పూర్(08562) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 16వ తేదీ రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయలుదేరి 18వ తేదీ రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.48 గంటలకు కొత్తవలస చేరకుని, అక్కడ నుంచి 10.50 గంటలకు బయలుదేరుతుంది. గోరఖ్‌పూర్–విశాఖపట్నం(08561) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 19వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి 21వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ మధ్యాహ్నం 11.22 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 11.24 గంటలకు బయలుదేరుతుంది.
- విశాఖపట్నం–దీన్‌దయాల్ ఉపాధ్యాయ (08530) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 6, 20, 27వ తేదీల్లో (గురువారం) సాయంత్రం 5.35 గంటలకు విశాఖలో బయలుదేరి ఫిబ్రవరి 8, 22, మార్చి1 (శనివారం)న వేకువజామును 4.30 గంటలకు దీన్ దయాల్ ఉపాధ్యాయకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఆయా రోజుల్లో సాయంత్రం 6.05 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 6.07గంటలకు బయలుదేరుతుంది.
- దీన్‌దయాల్ ఉపాధ్యాయ–విశాఖపట్నం (08529) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 8, 22, మార్చి 1(శనివారం)న రాత్రి 8.10 గంటలకు దీన్‌దయాల్ ఉపాధ్యాయలో బయలుదేరి, ఫిబ్రవరి 10, 24, మార్చి 3 (సోమవారం)వ తేదీల్లో తెల్లవారుజాము 3.25 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ తెల్లవారు 2.36 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 2.38 గంటలకు బయలుదేరుతుంది.

స్త్రీనిధి నిధులు పక్కదారిపై విచారణ

- సహకరించని గ్రూప్‌సభ్యులు
- విచారణ వాయిదా

సాక్షి ఎఫెక్ట్

బొబ్బిలిరూరల్: మండలంలోని ముత్తాయవలస గ్రామంలో పొదుపు సంఘాలకు స్త్రీనిధి ద్వారా అందించిన నిధులు పక్కదారి పట్టడంపై సాక్షి గురువారం స్త్రీనిధి నిధులు పక్కదారి అనే కథనాన్ని ప్రచురించగా స్త్రీనిధి జిల్లా ఏజీఎం ఉమామహేశ్వర్రావు స్పందించి శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని రామమందిరం వద్ద నిర్వహించిన ఈ విచారణలో ముందుగా లూర్థమాత పొదుపు సంఘంలోని నలుగురు మహిళలకు అందాల్సిన రుణాలను మరొకరికి అందజేసినట్లు తేలింది. దీంతో విచారణాధికారి ఉమామహేశ్వర్రావు వారిని, వీఓఏను హెచ్చరించారు.


ఇతరుల పేరుతో రుణాలను పొందిన వారిని ప్రశ్నిస్తున్న ఏజీఎం ఉమామహేశ్వర్రావు

రుణాలు తీసుకున్న వారికి ప్రత్యేకంగా ఇన్సూరెన్స్ ఉంటుందని, రుణగ్రహీతలు మరణిస్తే వారికి బీమా వర్తింపు ద్వారా రుణమాఫీ జరుగుతుందని, ఇతరులకు ఈ రుణాలను తీసుకుని వారు మరణిస్తే ఆ రుణం ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అలాగే రుణగ్రహీత బయోమెట్రిక్ ద్వారా మాత్రమే రుణం పొందగలరని, ఎలా ఇతరులకు ఈ రుణాలను అందజేశారో తెలియజేయాలని వీఓఏ సీతారాంను మందలించారు. విచారణ జరుగుతున్న సమయంలో మరి కొన్ని పొదుపు సంఘాల సభ్యులు, వారి కుటుంబసభ్యులు గుంపుగా చేరి విచారణను అడ్డుకున్నారు. విచారణ అవసరంలేదని తీవ్ర వాగ్వాదం, గందరగోళం సృష్టించడంతో ఏజీఎం విచారణను అర్ధాంతరంగా నిలిపివేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి సమయంలో విచారణ జరపలేమని, త్వరలో జిల్లా నుంచి విచారణ బృందం ద్వారా విచారణ జరుపుతామని తెలియజేశారు. కాగా ఇంకా గ్రామంలో మరో 10 సంఘాలలో ఇటువంటి రుణాలు ఇతర వ్యక్తులకే వెళ్లినట్లు, ఆయా సంఘాలను కూడా పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఆయా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలక్ష్మి, సీసీలు కోటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపారాధన

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను ఆలయ అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తూర్పురాజగోపురం సమీపంలోని వేదికపై ఉన్న ప్రత్యేక ఊయలలో సీతారామచంద్రస్వామిని ఆసీనులను చేసి సహస్ర దీపాల కాంతుల శోభలో పవళింపు సేవ జరిపించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో సహస్ర దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.


రామతీర్థంలో ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

గడ్డివాములు దగ్ధం

- 20 బస్తాలు ధాన్యం అగ్నికి ఆహుతి
- లబోదిబో మంటున్న రైతు


మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని పట్టాలమ్మతల్లి గుడి సమీపంలో గల సంఘం చిన్నారావుకు చెందిన గడ్డివాములు, 20 బస్తాల ధాన్యం శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో కాలిబూడిదయాయి. ఈ ప్రమాదానికి సంబందించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు రైతు చిన్నారావు తనకు ఉన్న నాలుగు ఎకరాల్లో వరి పంట వేసి నూర్పు చేసి కళ్లంలో గడ్డిమేటలు వేశారు. అలాగే సమీప రైతు నుంచి నాలుగు ఎకరాల్లో గడ్డిని కొనుగోలు చేసి మొత్తంగా 8 ఎకరాల్లో గడ్డి మేట్లు వేశాడు. ఈ గడ్డి మేట్ల కింద 20 బస్తాల ధాన్యం నిల్వ చేశాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం ఎలా జరిగిందో ఏమో తెలియదు గాని గడ్డివాముల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.10 నిమిషాల వ్యవధిలో గడ్డివాములకు మొత్తం అగ్నికీలలు వ్యాప్తించాయి.దీంతో ఎస్.కోట నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డి, ధాన్యం పూర్తిగా కాలిబూడిదయాయి. దీంతో రైతు చిన్నారావు లబోదిబోమంటూ రోదించాడు. చిన్నారావుకు జరిగిన నష్టంపై అంచనా వేసి ఉన్నతాదికారులకు నివేదిస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

ఆలయానికి చేరుకున్న స్వామివారి విగ్రహాలు



గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తిరుపతి నుంచి శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాలను పార్వతీపురం నుంచి మేళ తాళాలతో భక్తుల నడుమ అత్యంత వైభవంగా ఆలయానికి తరలించారు. విగ్రహాలను చూసేందుకు పరిసర గ్రామ ప్రజలు, భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో టీటీడీ కమిటీ సభ్యులు, భక్తులు, దాతలు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తులను గరిష్ట ధరకు విక్రయించాలి


గిరిజన ఉత్పత్తుల ధరలపై వివరిస్తున్న ఎంఎఫ్‌పీ సూపరింటెండెంట్ అప్పారావు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ఉత్పత్తులను గరిష్ఠ ధరకు విక్రయించాలని ఎంఎఫ్‌పీ సూపరింటెండెంట్ జి.అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని బీరుపాడులో జీసీసీ గిరిజన ఉత్పత్తులపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులకు సంబంధించి విశాఖపట్నం జీసీసీ ప్రధాన కార్యాలయం నుంచి గిరిజన ఉత్పత్తులపై కొత్త ధరలను ప్రకటించడం జరిగిందన్నారు. జీసీసీ నిర్ణయించిన ధరల కంటే తక్కువకు ఏ ఒక్క గిరిజనుడు ఉత్పత్తులను విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో సేల్స్‌మేన్ జె.గోపాలరావు తదితరులున్నారు.

ఈతకు దిగిన ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

తగరపువలస/గరివిడి: ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్‌లో శుక్రవారం ఈతకు దిగిన ఇంజినీరింగ్ విద్యార్థి మీసాల నాని (20) మృతి చెందాడు. కొమ్మాది గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాలలో అతను సివిల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి మండలం కందిపేటకు చెందిన నాని, ఆరుగురు స్నేహితులతో కలిసి సరదాగా రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లాడు. ఈతకు దిగిన సమయంలో నాని రిజర్వాయర్‌లో మునిగిపోతుండటంతో, అతని స్నేహితులు కాపాడాలని కేకలు వేశారు. అక్కడే ఉన్న గ్రామస్తులు ప్రయత్నించినప్పటికీ, నాని మునిగిపోయి మృతి చెందాడు. ఆనందపురం పోలీసులు, తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది రిజర్వాయర్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ వాసు నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాని కొమ్మాదిలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. అతని తల్లిదండ్రులు వ్యవసాయదారులు.